



పాఠశాలకు చేరుకుంటున్న విద్యార్థినుల తల్లిదండ్రులు

పోలీసుల పనితీరు అభినందనీయం

- ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి
- విజబుల్ పోలీసింగ్‌కు ప్రాధాన్యత ఇవ్వాలి
- రాష్ట్ర డిజిపి ద్వారకా తిరుమల రావు



మాట్లాడుతున్న డిజిపి ద్వారకా తిరుమల రావు

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్

జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుల కృషి, పని తీరు అభినందనీయమని రాష్ట్ర డిజిపి ద్వారక తిరుమల రావు కొనియాడారు. బుధవారం జిల్లా పర్యటనకు వచ్చిన డిజిపి ద్వారకా తిరుమలరావు జిల్లా పోలీసు కార్యాలయంలోని వ్యాస్ ఆడిటోరియం దగ్గర పోలీసుల నుండి గౌరవవందనం స్వీకరించారు. అనంతరం వ్యాస్ ఆడిటోరియం ఎదుట ఆయన మొక్కలను నాటారు. పోలీసు అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు విజిబుల్ పోలీసింగ్ ఉండాలని, నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి నేరాలను అరికట్టాలని సూచించారు. సైబర్ నేరాలను కట్టడి చేయాలన్నారు. చిన్న పిల్లలు, మహిళల పై జరిగే లైంగిక నేరాలను అరికట్టాలన్నారు. పోలీసు బృందాలు ఏర్పాటు చేసి నేరాలను చేధించాలన్నారు. విస్తృతంగా టెక్నాలజీ వినియోగించాలన్నారు. సిఐలకు డిఎస్పీలుగా త్వరలో ప్రమోషన్లు కల్పిస్తామని తెలిపారు. అనంతరం డిజిపిని కర్నూలు రేంజ్ డిఐజి, కర్నూలు జిల్లా ఎస్పీ శాలువాతో సన్మానించి, నటరాజ విగ్రహ జ్ఞాపికను అందజేశారు. అనంతరం డిజిపి మీడియాతో మాట్లాడారు. ఎఎస్పీ ట్రైనీగా కర్నూలు జిల్లాలో తాను పని చేశానన్నారు. కర్నూలు జిల్లా పోలీసుల పని తీరు సంతృప్తికరంగా ఉందన్నారు. కర్నూలు ఎస్పీగా పని చేస్తున్న జి. బిందు మాధవ్ కాకినాడకు బదిలీ అయ్యారని, ఆయనతో కూడా మాట్లడినట్లు చెప్పారు.కొత్తగా జరుగుతున్న నేరాల పట్ల, క్రైమ్ రివ్యూ విషయంలో టెక్నాలజీ వాడుకోవాలనే విషయాలను కేసులు త్వరితగతిన పురోగతి సాధించాలని జిల్లా పోలీసు అధికారులకు తెలిపారు. మ్యాన్ ఫవర్ తగ్గించి, సాంకేతికత పరిజ్ఞానం వినియోగిస్తూ కేసులు చేధించాలన్నారు. ప్రజలకు మేరుగైన సేవలు అందించాలనే లక్ష్యంతోనే పోలీసు యంత్రాంగం పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో కర్నూలు రేంజ్ డిఐజి డాక్టర్ కోయ ప్రవీణ్, కర్నూలు జిల్లా ఎస్పీ జి.బిందు మాధవ్, హెూంగార్డు కమాండెంట్ సదరన్ రీజియన్ ఎం.మహేష్ కుమార్, అడిషనల్ ఎస్పీ అడ్మిన్ హుస్సేన్ పీరా, డిఎస్పీలు బాబు ప్రసాద్, వెంకట్రామయ్య, ఉపేంద్రబాబు, హేమలత, భాస్కర్ రావు, ట్రైనీ డిఎస్పీ ఉష శ్రీ, సిఐలు , ఆర్ ఐలు పాల్గొన్నారు.

విద్యార్థినులపై లైంగిక వేధింపులు

- ఉపాధ్యాయుడిని గదిలో బంధించిన తల్లిదండ్రులు
- ఎంఇఒలు చేరుకుని విచారణ - ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేసిన డిఇఒ

ప్రజాశక్తి - కోడుమూరు రూరల్

విద్యాబుద్ధులు నేర్పాల్సిన గురువే దారి తప్పుతున్నాడు. తాజాగా కోడుమూరు మండలం వెంకటగిరి గ్రామ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో కీచక ఉపాధ్యాయుడు లక్ష్మన్న గత 6 నెలలుగా విద్యార్థినులపై లైంగిక వేధింపులకు పాల్పడుతున్న విషయం బుధవారం బయట పడింది. దీంతో కోపోద్రిక్తమైన తల్లిదండ్రులు, స్థానికులు అధిక సంఖ్యలో పాఠశాలకు చేరుకొని ఉపాధ్యాయుడిని గదిలో బంధించారు. విషయం తెలిసిన ఎంఇఒలు వసంతబాయి, తైమూరు బాషాలు పాఠశాలకు చేరుకున్నారు. విద్యార్థినులు ఎంఇఒల ఎదుట చిగురు టాకుల వణికిపోతూ ఉపాధ్యాయుడి వేధింపుల గురించి చెప్పలేక కన్నీరు మున్నీరయ్యారు. ఉపాధ్యా యుడు లక్ష్మన్న చెడుగా ప్రవర్తిస్తున్నాడని విద్యార్థినిలు ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధ్యాయుడి లైంగిక వేధింపులు భరించలేక కొంతమంది విద్యార్థినులు వేరే పాఠశాలలకు వెళ్ళినట్లు స్థానికులు చెప్పారు. ఉపాధ్యాయుడు లక్ష్మన్నను వెంటనే సస్పెండ్ చేయాలని పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ ప్రసాద్ డిమాండ్ చేశారు. అనంతరం పోలీసు సిబ్బంది వచ్చి ఉపాధ్యాయుడుని అదుపులోకి తీసు కున్నారు. విచారణ చేసి చర్యలు తీసుకుంటా మని ఎంఇఒలు తెలియజేశారు.

ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేసిన డిఇఒ : పాఠశాలలో విద్యార్థినుల పట్ల లైంగిక వేధింపులకు పాల్పడిన ఉపాధ్యాయుడు లక్ష్మన్నను డిఈఓ శామ్యుల్ పాల్ విధుల నుండి సస్పెండ్ చేశారు. ఉపాధ్యాయుడు లక్ష్మణపై ఫోక్సో కేసు నమోదు కావడంతో సిసిఏ రూల్స్ ప్రకారం సస్పెండ్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు.

విజయోత్సాహంలో విషాదం

- రోడ్డు ప్రమాదంలో ముగ్గురు విద్యాపీఠం విద్యార్థులు, డ్రైవర్ మృతి
- శ్రీమఠం పీఠాధిపతులు, ప్రముఖుల దిగ్భ్రాంతి

ప్రజాశక్తి - మంత్రాలయం

కర్ణాటక రాష్ట్రంలోని హంపిలో కొలువైన శ్రీనరహరి తీర్థుల పూజ విషయంలో గత 26 సంవత్సరాలుగా మంత్రాలయం శ్రీ రాఘవేంద్ర స్వామి మఠానికి, ఉత్తరాది మఠానికి మధ్య కోర్టులో కేసు నడిచింది. ఈ కేసులో విజయం సాధించిన మంత్రాలయం శ్రీమఠం యాజమాన్యానికి విషాదం ఎదురయింది. విజయోత్సవంతో పాటు తొలి పూజ నిర్వహించేందుకు మంగళవారం రాత్రి బయల్దేరి వెళ్లిన శ్రీగురు సార్వభౌమ సంస్కృత విద్యాపీఠం విద్యార్థుల్లో ముగ్గురు, డ్రైవర్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం తీరని విషాదాన్ని మిగిల్చింది. ఈ ఘటనతో పీఠాధిపతులు శ్రీసుభుదేంద్ర తీర్థులు, ప్రముఖులు దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు.



నివాళ్లులర్పించి, కుటుంబాన్ని పరామర్శిస్తున్న రాఘవేంద్ర రెడ్డి

విజయోత్సవంతో పాటు తొలి పూజ నిర్వహించేందుకు శ్రీమఠం యాజమాన్యం చర్యలు చేపట్టింది. ఆరాధనను ఘనంగా నిర్వహించేందుకు శ్రీమఠం పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థుల ఆదేశాల మేరకు తుపాను వాహనంలో 10 మంది విద్యార్థులతో మంత్రాలయం నుంచి మంగళవారం రాత్రి బయల్దేరి వెళ్లారు. సుమారు రాత్రి 10.30 గంటల సమయంలో కర్ణాటక రాష్ట్రంలోని సింధనూర్-పోతునాళ పట్టణాల మధ్య వాహనం అదుపు తప్పి బోల్తా పడి విద్యార్థులు మంత్రాలయం కొప్పళ, గంగావతికి చెందిన సుజయీంద్ర (19), అభిలాష్ (21), హయవదన (22)తో పాటు మంత్రాలయానికి చెందిన డ్రైవర్ శివ (22) మృతి చెందారు. ఈ ఘటనపై శ్రీమఠం పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులు ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల కుటుంబాలకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. మంత్రాలయం వైసిపి ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ ఎన్.రాఘవేంద్ర రెడ్డి, మండల అధ్యక్షులు పన్నగ వెంకటేష్ స్వామి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

మృతుల కుటుంబాలకు అండగా ఉంటాం
టిడిపి ఇన్‌ఛార్జీ రాఘవేంద్ర రెడ్డి

కర్ణాటక రాష్ట్రంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబాలకు అండగా ఉంటామని టిడిపి ఇన్‌ఛార్జీ ఎన్.రాఘవేంద్ర రెడ్డి తెలిపారు. సుజయీంద్ర మృతదేహానికి ఆయన పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ దుర్ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, రాష్ట్ర మంత్రులు దిగ్భ్రాంతిని వెల్లి బుచ్చారని, ప్రభుత్వం నుంచి సహకారం అందిస్తామని ఆయన తెలిపారు. టిడిపి నాయకులు అశోక్ రెడ్డి, వరదరాజులు, రాఘవేంద్ర, డిసి.తిమ్మప్ప, శివ, రాఘన్న, డేవిడ్ ఉన్నారు.



బాలోత్సవం పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కలెక్టర్

నైపుణ్యాలను వెలికి తీయండి

- జిల్లా కలెక్టర్ పి.రంజిత్ భాష

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభా పాటవాలను, నైపుణ్యాలను వెలికి తీయాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా పేర్కొన్నారు. బుధవారం జిల్లా కలెక్టర్ చాంబర్లో బాలోత్సవం-2025 పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ బాలోత్సవాల్లో ఎక్కువ మంది విద్యార్థులను భాగస్వామ్యం చేయాలని బాలోత్సవ కమిటీ నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో బాలోత్సవ నిర్వహణ కమిటీ సభ్యులు డి ధనుంజయ, జెఎన్ శేషయ్య, కెంగార మోహన్, జె.రంగస్వామి, హేమంత్ కుమార్, యుఆర్ఏ రవికుమార్, ఎస్ఎం.జయరాజు, బీడీ సుధీర్ రాజు, ఎల్లాగౌడ్, సాయి ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

ఫిబ్రవరి 1 నుండి 3 వరకు

ఉరుకుందలో మహా కుంభాభిషేకం

- ముస్తాబవుతున్న ఉరుకుంద క్షేత్రం

ప్రజాశక్తి - కౌతాళం

ఫిబ్రవరి 1 నుండి 3వ తేదీ వరకూ జరిగే మహా కుంభాభిషేకం ఉత్సవానికి నరసింహ ఉరుకుంద ఈరన్న స్వామి పుణ్యక్షేత్రం ముస్తాబు అవుతోంది. 12 సంవత్సరాలకు ఒకసారి నిర్వహించే ఈ కార్యక్రమం మొదటిసారిగా ఉరుకుంద క్షేత్రంలో నిర్వహిస్తుండడంతో భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు. పుణ్యక్షేత్రానికి డిప్యూటీ కమిషనర్ హోదా రావడం, మహా కుంభాభిషేకానికి శ్రీకారం చుట్టడంతో స్వామి వారి భక్తులు ఎంతో ఆసక్తితో ఎదురు చూస్తున్నారు. ఈ క్షేత్రంలో శ్రావణ మాస ఉత్సవాలు, కార్తీక మాస ఉత్సవాలు, తుంగభద్ర పుష్కరాలు చూసిన భక్తులకు ఫిబ్రవరి 1 నుండి 3వ తేదీ వరకు జరిగే మహా కుంభాభిషేకం ఓ ప్రత్యేకత సంచరించుకుంది.


దాతల సహకారంతో భారీగా ఏర్పాట్లు : నరసింహ ఉరుకుంద ఈరన్న స్వామి దేవస్థానం డిప్యూటీ కమిషనర్ మేడేపల్లి విజయరాజు దాతల సహకారంతో భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు. రాజా గోపురాలకు ప్రత్యేక రంగులు, వివిధ ప్రాంతాల నుండి వచ్చే భక్తులకు విడిది కోసం షెడ్లు, పుణ్యక్షేత్రం ఉత్తర, దక్షిణ, తూర్పు పడమర ద్వారా ముందు విశాలమైన ప్రదేశం, ఐమాక్స్ విద్యుత్ లైట్లు, గదులు ఆధునికరణ, అన్నదానం సత్రంలో ఆధునిక పరికరాలపై దృష్టి సారించారు. మాడ వీధుల చుట్టూ ప్రత్యేక క్యూలైన్ల పనులు వేగవంతంగా జరుగుతున్నాయి.

ప్రత్యేక కార్యక్రమాలు : మహా కుంభాభిషేకం ఉత్సవాల్లో భాగంగా రాజా గోపురంతో పాటు తూర్పు, పడమర, ఉత్తర, దక్షిణ గోపురాలకు కలశ ప్రతిష్టాపన, విజయ గణపతి, శ్రీలక్ష్మి అమ్మ వారు, ధ్వజస్తంభం, నవగ్రహాలు, యాగశాల ప్రతిష్టాపన కార్యక్రమాలు చేపడుతున్నట్లు డిప్యూటీ కమిషనర్ విజయ రాజు తెలిపారు.

పీఠాధిపతులు రాక : ఉత్సవాలకు కంచి రామకోటి పీఠం పీఠాధిపతులు శంకర విజయేంద్ర సరస్వతి స్వామి, పుష్పగిరి పీఠం పీఠాధిపతులు శంకరాచార్య విద్య నరసింహ భారతి స్వామి, శ్రీశైలం పీఠాధిపతులు చెన్నై సిద్ధ రామ శివచార్య స్వామి, మంత్రాలయం పీఠాధిపతులు సుబుదేంద్ర తీర్థ స్వామి, హాలివి మఠం పీఠాధిపతులు మహంతేష్ స్వామితో పాటు వివిధ ప్రముఖ స్వాములు హాజరు కానున్నారు.

రాష్ట్ర మంత్రులకు, అధికారులకు ఆహ్వానం : మహా కుంభాభిషేకం కార్యక్రమానికి మంత్రులు ఆనం రామ నారాయణరెడ్డి, నిమ్మల రామానాయుడు, టీజీ భారత్, దేవదాయ ధర్మదాయ శాఖ కమిషనర్ శ్రీరామ సత్యనారాయణ, కర్నూలు ఎంపీ బస్తీపాటి నాగరాజు, మంత్రాలయం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డితో పాటు ఎమ్మెల్సీలు బిటి నాయుడు, మధుసూదన్, జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులకు ప్రత్యేకంగా ఆహ్వానించినట్లు డిప్యూటీ కమిషనర్ తెలిపారు.

హెలిక్యాప్టర్ ద్వారా పూల వర్షం : మహా కుంభాభిషేకం కార్యక్రమంలో హెలిక్యాప్టర్ ద్వారా పూలు వర్షం కురిపించడానికి బళ్లారికి చెందిన దాత ముందుకు వచ్చారు.



ఉరుకుందలో భారీగా ఏర్పాట్లు చేస్తున్న దృశ్యం



ఆహ్వానిస్తున్న దృశ్యం

రూ.291.67 కోట్లతో

- నగరపాలక అంచనా బడ్జెట్ - స్థాయి సంఘ సమావేశంలో ఆమోదం

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్



మాట్లాడుతున్న కమిషనర్ రవీంద్రబాబు

కర్నూలు నగరపాలక సంస్థ 2025-2026 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి అంచనాల బడ్జెట్‌ను బుధవారం స్థాయి సంఘం ఆమోదించింది. నగరపాలక కార్యాలయంలో మేయర్ బివై.రామయ్య అధ్యక్షతన స్థాయి సంఘ సమావేశం నిర్వహించారు. రూ.291.67 కోట్లతో బడ్జెట్ రూపకల్పన చేశారు. మొత్తం ఆదాయం రూ.363.99 కోట్లు, ఖర్చు రూ.201.22 కోట్లు, రెవెన్యూ ఆదాయం రూ.201.22 కోట్లు, ప్రభుత్వ గ్రాంట్లు రూ.162.77 కోట్లు, మూలధన రాబడి రూ.138.69 కోట్లు, నికర మిగులు రూ.72.31 కోట్లుగా అంచనాలు తయారు చేశారు. అలాగే రెండు తీర్మానాలకు స్థాయి సంఘం ఆమోదం తెలిపింది. అమృత్-2 పథకంలో భాగంగా 19వ వార్డులోని నాగిరెడ్డి రెవెన్యూ కాలనీ పబ్లిక్ పార్కు, 45వ వార్డులోని టీచర్స్ కాలనీ పబ్లిక్ పార్కుల నిర్వహణ బాధ్యతలను పొదుపు సంఘాలకు కేటాయించి, ఏడాది కాలానికి సంబంధించి ఒక్కొక్క పార్కుకు రూ.4.90 లక్షలు చెల్లించేందుకు ఆమోదం తెలిపారు. 200 మంది తాత్కాలిక పారిశుధ్య కార్మికులకు సంబంధించి గత ఏడాది డిసెంబర్ 17 నుండి ఈ ఏడాది జనవరి 31 నాటికి సంబంధించి, రూ.42.93 లక్షల వేతనాలు చెల్లింపునకు ఆమోదం తెలిపారు. కమిషనర్ ఎస్.రవీంద్ర బాబు, సభ్యులు జుబేర్, యూనూస్, క్రాంతి కుమార్, మిద్దె చిట్టమ్మ, అదనపు కమిషనర్ ఆర్‌జివి.క్రిష్ణ, మేనేజర్ ఎన్.చిన్నరాముడు, అకౌంట్స్ అధికారి చుండి ప్రసాద్, ఆరోగ్యధికారి కె.విశ్వేశ్వర్ రెడ్డి, ఎస్ఈ రాజశేఖర్, సిటి ప్లానర్ ప్రదీప్ కుమార్, ఆర్ఓలు జునైద్, ఇశ్రాయేలు, టిపిఆర్ఓ వెంకటలక్ష్మి, ఎగ్జామినర్ సుబ్రమణ్యం, అధికారులు శబాన, మల్లికార్జున్, క్లర్క్ జి.ఎం. శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

మిరప క్షేత్రస్థాయి సందర్శన

ప్రజాశక్తి - సి బెళగల్



మాట్లాడుతున్న ప్రతినిధి బృందం

మండలంలోని కొండాపురంలో అగ్ని వన్ మిరప పంట సాగును ఉమ్మడి జిల్లాల ఏరియా సీడ్స్ మేనేజర్ సతీష్ సమక్షంలో రైతు బృందం బుధవారం సందర్శించింది. రైతు నాయకంటి శంకర్ రెడ్డి నాలుగు ఎకరాల్లో ఈ మిరప సాగు చేయగా పెట్టుబడి రూ.1.50 లక్షలు పెట్టినట్లు తెలిపారు. మూడు కోతలకు ఎకరాకు సుమారు 30 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని రైతు శంకర్ రెడ్డి పేర్కొన్నారు. ఈ కొత్త రకం మిరప సాగు చేయడం వల్ల రైతుకు నష్టం లేదని, నీటి తడులు ఆలస్యమయినా పూత రాలదని చెప్పారు. కాయలు తెగి పడవని, తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి పొందవచ్చని మేనేజర్ పేర్కొన్నారు. ప్రస్తుతం మార్కెట్లో ఈ మిరప క్వింటాకు రూ.14 వేల నుంచి రూ.20 వేల వరకు ఉందని సేల్స్ మేనేజర్ మల్లయ్య వివరించారు. అగ్నివన్ ఎఫ్ వన్ మిరప విత్తనాలు హెచ్ఎం క్లాస్ కంపెనీ ద్వారానే అందుబాటులో ఉన్నాయని ఫీల్డ్ ఆఫీసర్ సోమశేఖర్ తెలిపారు.

ఖర్చులు తగ్గించి.. ఆదాయం పెంచాలి

- డిజిపి, ఆర్‌టిసి వీసీ అండ్ ఎమ్‌డి ద్వారక తిరుమల రావు

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

ఎపిఎస్ఆర్‌టిసిలో ఖర్చులు తగ్గించి ఆదాయాన్ని పెంచుకోవాలని డిజిపి, ఎపిఎస్ఆర్‌టిసి వీసీ అండ్ ఎమ్‌డి ద్వారక తిరుమలరావు తెలిపారు. బుధవారం ఆయన కర్నూలు వన్ డిపోను సందర్శించారు. ముందుగా ఆయనకు కర్నూలు రీజినల్ మేనేజర్ శ్రీనివాసులు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. ప్రాంగణంలో మామిడి మొక్కను నాటారు. డిపో గ్యారేజీలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రయాణికులకు బస్సుల ఆపరేషన్ ద్వారా కార్గో సేవల ద్వారా ఆదాయాన్ని పెంచుతూ వ్యయాన్ని తగ్గించాలని తెలిపారు. సిబ్బందికి రావాల్సిన అలవెన్సులు, ఆర్‌పిఎస్ 2017కు సంబంధించిన బకాయిలను ఈనెలలోపు ఇచ్చేటట్లు చర్యలు తీసుకుంటానని చెప్పారు. తాను విరమణ పొందేలోపు ముఖ్యమంత్రితో మాట్లాడి సిబ్బందికి రావాల్సిన బకాయిలన్నీ వచ్చేలాగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కడప జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పైడి చంద్రశేఖర్, కర్నూలు జిల్లా ప్రజారవాణా అధికారి టి.శ్రీనివాసులు, డిప్యూటీ మెకానికల్ ఇంజినీర్ వి.హరిబాబు పాల్గొన్నారు.

జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలు, రహదారి భద్రతపై అవగాహన

నగరంలోని బళ్లారి చౌరస్తాలో జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలు, రోడ్డు భద్రతపై మ్యాక్సీ క్యాబ్, మోటార్ క్యాబ్ డ్రైవర్లకు అవగాహన కల్పించారు. మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్లు కె.రవీంద్ర కుమార్, ఎస్.నాగరాజా నాయక్, ఎంవి.సుధాకర్ రెడ్డి మాట్లాడారు. జనవరి 16 నుంచి ఫిబ్రవరి 15 వరకు నిర్వహించే రోడ్డు భద్రత మాసోత్సవాల్లో వాహనదారులకు రహదారి భద్రతలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్లు వి.బాబు కిషోర్, ఎన్.గణేష్ బాబు, డాక్టర్ జశన్ అహ్మద్, ట్రాన్స్‌పోర్ట్ హెడ్ కానిస్టేబుళ్లు చలపతి, వి.విజయభాస్కర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిజిపి ద్వారక తిరుమల రావు

గర్భిణుల ఆరోగ్య పరిస్థితిని పర్యవేక్షించాలి : కలెక్టర్

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

గర్భిణులను వంద శాతం నమోదు చేసి వారి ఆరోగ్య పరిస్థితిని క్రమం తప్పకుండా పర్యవేక్షించాలని కలెక్టర్ పి.రంజిత్ బాష వైద్య శాఖ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో వైద్య, ఆరోగ్య శాఖాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ... గర్భిణులను 38,018 మందిని గుర్తించగా, 3 నెలల్లోపు ఉన్న గర్భిణులు 34,198 మందిని మాత్రమే రిజిస్టర్ చేయడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. మహిళలు గర్భం దాల్చిన 3 నెలల్లోపే ఎందుకు నమోదు చేయలేకపోతున్నారని డిఎంహెచ్ఒను ప్రశ్నించారు. తగినంత మంది ఆశా వర్కర్లు, ఎఎన్ఎంలు ఉన్నారని, గ్రామంలో కేవలం ఇద్దరు లేదా ముగ్గురు గర్భిణులు ఉంటారని తెలిపారు. వారిని కూడా నమోదు చేయకపోతే ఎలా అని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆలస్యంగా నమోదు చేస్తే ఆరోగ్య పరిస్థితిలో ఇబ్బందులుంటే గుర్తించే అవకాశం ఉండదన్నారు. మండలాల వారీగా సమావేశాలు నిర్వహించి, 3 నెలల్లోపు నమోదు చేయని సిబ్బందికి షోకాజ్ నోటీసులు జారీ చేయాలని డిఎంహెచ్ఒను ఆదేశించారు. టీనేజ్ ప్రెగ్నెన్సీలు ఎక్కువగా నమోదవుతున్నాయని, ఎందుకు జరుగుతున్నాయో కారణాలను విశ్లేషించాలని తెలిపారు. డివిజన్ స్థాయిలో ఆర్‌డిఒ ఆధ్వర్యంలో ఒక సబ్ కమిటీని ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కమిటీలో డిఐఒ, డిప్యూటీ డిఎంహెచ్ఒ, ఐసిడిఎస్, పోలీసు సిబ్బంది ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వాస్పత్రిలో ఒపి కౌంటర్ల వద్ద ఎక్కువమంది జనాభా ఉండకుండా వైద్య విభాగాల వారీగా టోకెన్లను ఇచ్చే విధంగా కౌంటర్లను ఏర్పాటు చేయాలని సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. డిఎంహెచ్ఒ డాక్టర్ శాంతికళ, ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు, స్టేట్ క్యాన్సర్ ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ శ్రీకృష్ణ ప్రకాష్, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ సింధు సుబ్రమణ్యం, అదనపు డిఎంహెచ్ఒ డాక్టర్ భాస్కర్, డిసిహెచ్ఎస్ మాధవి, మలేరియా అధికారి నూకరాజు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్ బాష

ఇండికేటర్స్ సాధించడానికి కృషి చేయాలి

ఇండికేటర్స్ సాధించేందుకు కృషి చేయాలని నీతి అయోగ్ అడిషనల్ మిషన్ డైరెక్టర్ డాక్టర్ మహేంద్ర కుమార్ కలెక్టర్, సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం అస్పిరేషన్ బ్లాక్ కార్యక్రమాలపై సమీక్షించి పలు సూచనలు చేశారు. కర్నూలు జిల్లాలోని మూడు అస్పిరేషన్ బ్లాక్‌లు హోళగుంద, చిప్పగిరి, మద్దికెరలో జరుగుతున్న అభివృద్ధి పనులకు సంబంధించిన కీ పర్ఫామెన్స్ ఇండికేటర్స్ మ్యాపింగ్‌పై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి తగు సూచనలు చేశారు. ఆకాంక్ష హర్ట్ కార్యక్రమాలపై పూర్తి వారాంతపు కార్యక్రమాన్ని రూపొందించుకోవాలని, రూపొందించుకున్న కార్యక్రమాన్ని అనుసరించి ప్రగతిని సాధించాలని సూచించారు. నీతి ఆయోగ్ వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ పి.రంజిత్ బాష జిల్లాలోని హోళగుంద, మద్దికెర, చిప్పగిరి (అస్పిరేషనల్ బ్లాక్స్) మండలాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులపై జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు.

అమిత్ షా రాజీనామా చేయాలి

- కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంబటి రామకృష్ణ

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

అంబేద్కర్ అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర మంత్రి అమిత్ షా మంత్రి పదవికి రాజీనామా చేయాలని రాష్ట్ర కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి అంబటి రామకృష్ణ యాదవ్ డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో 'జై బాపూజీ, జై భీమ్, జై సంవిధాన్' పాదయాత్ర నిర్వహించారు. రామకృష్ణ యాదవ్, డిసిసి అధ్యక్షులు పి.మురళీకృష్ణ పాల్గొని మాట్లాడారు. బిజెపి ప్రభుత్వం భారత రాజ్యాంగాన్ని మార్చేయాలని యోచనలో ఉందని, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళల హక్కులను కాలరాయాలను చూస్తోందని మండిపడ్డారు. అంబేద్కర్‌ను అవమానించిన అమిత్ షాను బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. మాజీ ఎమ్మెల్సీ ఎం.సుధాకర్ బాబు, నియోజకవర్గాల ఇన్‌ఛార్జీలు ఎం.ఖాసీం వలీ, చిప్పగిరి లక్ష్మీనారాయణ, రమేష్ యాదవ్, బి.క్రాంతి నాయుడు, పి.మురళీకృష్ణమరాజు, జిల్లా ఓబీసీ ఛైర్మన్ డివి.సాంబశివుడు, ఐఎన్‌టియుసి అధ్యక్షులు బి.బతుకన్న, ప్రధాన కార్యదర్శి ఎన్.సుంకన్న, కాంగ్రెస్ నాయకులు దేవిశెట్టి ప్రకాష్, జిల్లా మహిళా కాంగ్రెస్ ఎస్.ప్రమీల, కాంగ్రెస్ నాయకులు కె.వెంకటరెడ్డి, ఎన్‌సి.బజారన్న, ఎజాస్ అహ్మద్, బి.సుబ్రహ్మణ్యం, ఈ.లాజరస్, షేక్ ఖాజా హుస్సేన్, అనంతరత్నం మాదిగ పాల్గొన్నారు.



పాదయాత్రను ప్రారంభిస్తున్న నాయకులు

పత్తి జిన్నింగ్ ఫ్యాక్టరీలో అగ్ని ప్రమాదం

- రూ. 10 కోట్ల వరకు నష్టం
- రైతులకు చెందిన బొలెరో వాహనం దగ్ధం

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని పట్టణంలోని బసాపురం రోడ్‌లో ఉన్న సంతోష్ జిన్నింగ్ అండ్ ప్రెస్సింగ్ పత్తి ఫ్యాక్టరీలో బుధవారం భారీ అగ్ని ప్రమాదం జరిగింది. మధ్యాహ్నం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల పొగలు వ్యాప్తి చెందాయి. ఈ ప్రమాదంలో సుమారు రూ.10 కోట్ల వరకు ఆస్తి నష్టం వాటిల్లిందని ఫ్యాక్టరీ యాజమాని ప్రశాంత్ తెలిపారు. సుమారు రూ.6 కోట్ల విలువైన పత్తి, రూ.2 కోట్ల విలువ గల పత్తి బేల్లు (600 బెల్లు), సుమారు కోటి రూపాయల పత్తి సీడ్, మోటర్లు పూర్తిగా దగ్ధమయినట్లు యజమాని తెలిపారు. పత్తి ఫ్యాక్టరీలో చెలరేగుతున్న మంటలను రెండు ఫైర్ ఇంజన్‌తో సిబ్బంది మంటలను అదుపు చేస్తున్నారు. పత్తిని అమ్ముకోవడానికి తీసుకొచ్చిన రైతులు రెండు బొలెరో వాహనాలు కూడా మంటల్లో కాలిపోయాయి.

విద్యా బలోపేతమే లక్ష్యం

- పత్తికొండ ఎమ్మెల్యే శ్యాం కుమార్

ప్రజాశక్తి - పత్తికొండ

విద్యను బలోపేతం చేయడమే లక్ష్యంగా ఉపాధ్యాయులు పని చేయాలని పత్తికొండ ఎమ్మెల్యే కెఇ.శ్యాం కుమార్ తెలిపారు. బుధవారం పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. పాఠశాలలో విద్యాబోధన ఎలా ఉందని విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు కూటమి ప్రభుత్వం అన్ని రకాల సదుపాయాలను కల్పించిందని తెలిపారు. బాలికలతో ఎమ్మెల్యే ముచ్చటించి విద్యాబోధన, మౌలిక సదుపాయాలు, ఆహార నాణ్యత, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పదో తరగతిలో బాలికలు మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించి పత్తికొండ పేరు నిలపాలని తెలిపారు. బాలికలు పాఠశాలలో కూర్చోవడానికి బెంచీలు లేవని ప్రధానోపాధ్యాయులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. త్వరలోనే పాఠశాలలోని బాలికలకు బెంచీలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. అనంతరం 8, 9, 10వ తరగతి చదువుతున్న 700 మంది విద్యార్థినులకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. ఎంఇఒ రమేష్, టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు సాంబశివారెడ్డి, రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి బత్తిని లోకనాథ్, రామానాయుడు, ప్రధానోపాధ్యాయులు భ్రమరాంబ పాల్గొన్నారు. **తుగ్గలి** మండలం కడమకుంట్ల పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో రూ.92 లక్షలతో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులు ఎమ్మెల్యే శ్యామ్ కుమార్ ప్రారంభించారు. రాష్ట్ర మాజీ శాలివాహన ఫెడరేషన్ ఛైర్మన్ తుగ్గలి నాగేంద్ర, సర్పంచి సలహాదారుడు సుల్తాన్, మండల అధ్యక్షులు తిరుపాల్ నాయుడు, బత్తిని వెంకట రాముడు పాల్గొన్నారు.



పెన్నులు, పుస్తకాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శ్యాంకుమార్

నాణ్యమైన భోజనమందించాలి

- అన్నా క్యాంటీన్‌లో కమిషనర్ తనిఖీ


సమస్యలు తెలుసుకుంటున్న కమిషనర్ కృష్ణ

ప్రజాశక్తి - ఆదోని

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న అన్నా క్యాంటీన్‌లో నాణ్యమైన భోజన పదార్థాలను వడ్డించాలని మున్సిపల్ కమిషనర్ కృష్ణ తెలిపారు. బుధవారం ఆదోనిలోని నిర్మల్ థియేటర్ ఎదురుగా ఉన్న అన్నా క్యాంటీన్‌ను తనిఖీ చేసి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అక్కడ వడ్డిస్తున్న ఆహార పదార్థాలను రుచి చూశారు. నిర్ణయించిన మెనూ ప్రకారమే టిఫిన్, భోజనం వడ్డించాలని నిర్వాహకులకు సూచించారు. శుద్ధమైన తాగునీరు అందించాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు.

సర్వీస్ ప్రొవైడర్ల సేవలను వినియోగించుకోవాలి

ఫుడ్, ఇతర వస్తువులు ఇంటి వద్దకే చేరవేస్తున్న కంపెనీల తరహాలో సర్వీస్ ప్రొవైడర్లను ప్రభుత్వం అందుబాటులోకి తెస్తుందని, వారి సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ కృష్ణ తెలిపారు. ఆదోని మున్సిపాలిటీ మెప్మా కార్యాలయంలో సర్వీస్ ప్రొవైడర్లకు అవగాహన కల్పించారు. ప్లంబర్, బ్యూషన్, ఎలక్ట్రీషియన్ సంబంధించిన వారు హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ... అవసరమున్న వారికి ఇంటి వద్దకు వచ్చి సర్వీసు అందిస్తారని తెలిపారు. మెప్మా సిఎంఎం జిలాని బాషా ఉన్నారు.

తాగునీటి సమస్యపై ముందస్తు జాగ్రత్తలు

- ఎంపిడిఒ అల్లా బకాష్


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ అల్లా బకాష్

ప్రజాశక్తి - చిప్పగిరి

వేసవి కాలం వస్తున్న నేపథ్యంలో తాగునీటి సమస్య ఏర్పడకుండా ప్రతి గ్రామంలోనూ సత్వర చర్యలు చేపట్టాలని ఎంపిడిఒ అల్లా బకాష్ పంచాయతీ కార్యదర్శులకు, సచివాలయ సిబ్బందికి సూచించారు. బుధవారం మండల కార్యాలయంలో ఇఒఆర్‌డి బాలన్న ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మిస్సింగ్ సిటిజన్, ప్రభుత్వ ఆదేశించిన సర్వేలను సకాలంలో పూర్తి చేయాలన్నారు. గ్రామాల్లో చెడిపోయిన బోర్లు ఉంటే మరమ్మతులు చేయించి అందుబాటులోకి తేవాలన్నారు. ఆర్‌డబ్ల్యుఎస్ సిబ్బందితో మాట్లాడి ఎక్కడా తాగునీరు వృథా కాకుండా చూసుకోవాలని తెలిపారు. ట్యాంకులకు అమర్చిన కుళాయిల దగ్గర మురుగునీరు రాకుండా చూసుకోవాలన్నారు. తాగునీటి వసతిపై ఎప్పటికప్పుడు అధికారులు తెలుసుకొని ఉండాలన్నారు. ఎపిఒ జుబేర్ అహ్మద్ పాల్గొన్నారు.

సామాజిక రక్షణ చట్టం ఏర్పాటు చేయాలి

- రజక వృత్తిదారుల సంఘం

ప్రజాశక్తి - ఆలూరు


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఎస్సీ, ఎస్టీ, అట్రాసిటీ మాదిరిగా రజకులకు సామాజిక రక్షణ చట్టం ఏర్పాటు చేయాలని ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సంఘం జిల్లా కమిటీ సభ్యులు ఈరన్న, నాగరాజు కోరారు. బుధవారం ఆలూరు, హత్తి బెళగల్ గ్రామాల్లో రజకులతో కలిసి సంఘం నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రాష్ట్రంలో రజకులకు సామాజిక భద్రత లేదని, రజకుల పట్ల దాడులు, మహిళలు, బాలికలపై అత్యాచారాలు నేటికీ కొనసాగుతున్నాయని తెలిపారు. వీటిని అరికట్టేందుకు ఎస్సీ, ఎస్టీ, అట్రాసిటీ మాదిరిగా రజకులకు సామాజిక రక్షణ చట్టం ఏర్పాటు చేయాలని కోరారు. రజక కార్పొరేషన్‌కు రూ.వెయ్యి కోట్లు కేటాయించాలని చెప్పారు. రజక వృత్తిదారులకు కార్పొరేషన్ ద్వారా 90 శాతం సబ్సిడీతో వృత్తి నైపుణ్యం పెంచుకునేందుకు, కుటుంబాల అభివృద్ధికి రూ.లక్ష రుణాలు ఇవ్వాలని కోరారు. రమేష్, వెంకటేష్, శివ, సాయి, హత్తిబెళగల్ నాగేంద్ర, ఎర్రిస్వామి, నాగరాజు, రాజప్ప, రామన్న పాల్గొన్నారు.

ఎస్ఐ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - మంత్రాలయం



ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయం ఎస్ఐగా శివాంజులు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఎస్ఐ పరమేష్ నాయక్‌ను విఆర్‌కు పంపినట్లు తెలిసింది. ఎస్పీ ఆదేశాల మేరకు మంత్రాలయం ఎస్ఐగా బాధ్యతలు చేపట్టినట్లు శివాంజులు తెలిపారు. బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించి పుణ్యక్షేత్ర పవిత్రతకు కృషి చేస్తానని చెప్పారు.

బెంచీలు మాయం

- అమ్మకానికేనా..?

- మరమ్మతుల కోసమే : ప్రధానోపాధ్యాయులు

ప్రజాశక్తి - ఆదోని

పట్టణంలోని మున్సిపల్ హైస్కూల్‌లో బెంచీలు మాయమయ్యాయని విద్యార్థులు చెబుతున్నారు. పాత సామాన్ల అంగడికి బెంచీలు తరలించి అమ్మరని విమర్శించారు. బెంచీలు అమ్మడంతో వచ్చిన మొత్తాన్ని స్కూల్ మెయింటెనెన్స్‌కు ఉపయోగించేలా ఉన్నతాధికారులు చూడాలని కోరుతున్నారు. మరమ్మతుల కోసమే తరలించినట్లు ప్రధానోపాధ్యాయులు పేర్కొంటున్నారు.

ఆలన, పాలన కరువు

ప్రభుత్వం ఇచ్చిన సామాన్ల ఆలన, పాలన చూసేవారు లేకపోవడం కారణంగానే నిరుపయోగంగా మారుతున్నాయని విద్యార్థులు వాపోతున్నారు. కింద కూర్చొని చదువుకునేందుకు విద్యార్థులకు అసౌకర్యంగా ఉంటుందని అప్పట్లో ప్రభుత్వం భావించింది. నాడు-నేడు కింద విద్యార్థుల సౌకర్యార్థం అప్పటి ప్రభుత్వం స్కూల్‌లో ప్రతి తరగతి గదిలోనూ బెంచీలు ఏర్పాటు చేసింది. బెంచీలు వెల్డింగ్ ఊడిపోవడంతో నిరుపయోగంగా ఉన్నాయని, విక్రయించాలన్నా ఉన్నతాధికారుల అనుమతి తీసుకోవాలి. పనికిరాని ఇనుప సామాన్లను ఒకచోట చేర్చి ఓపెన్ ఆక్షన్ కింద టెండర్ వేయాలి. ఆ వచ్చిన మొత్తాన్ని స్కూల్ మేనేజ్‌మెంట్ అకౌంట్‌లో జమ చేయాలని నిబంధనలు ఉన్నాయని ఉపాధ్యాయులు చెబుతున్నారు.


లారీలో బెంచీలను లోడ్ చేస్తున్న సిబ్బంది

నిబంధనలకు విరుద్ధంగా

వెల్డింగ్ ఊడిపోయి బెంచీలను ఓ చోట చేర్చి వాటిని పాత సామాన్ల అంగడికి తరలించి సొమ్ము చేసుకున్నట్లు వినికిడి. సుమారు 40 బెంచీలను లారీలో తరలించి విక్రయించినట్లు ఆరోపణలు ఉన్నాయి. విక్రయం ద్వారా వచ్చిన నగదు ఎవరి జేబులోకి వెళ్లిందో తేలాల్సి ఉంది. అప్పట్లో ఓ బెంచి రూ.8 వేల ప్రకారం ప్రభుత్వం ఇచ్చింది. ప్రస్తుతం 40 బెంచీలు కనపడడం లేదని, వాటిని ఎక్కడకు తరలించారు.. వచ్చిన మొత్తాన్ని దేనికి వినియోగించారు అన్న సందేహాలు బహిర్గతం పరచాల్సి ఉందని డిమాండ్ చేస్తున్నారు.

మరమ్మతుల కోసమే : - ప్రధానోపాధ్యాయులు మల్లికార్జున

తరగతి గదుల్లో నిరుపయోగంగా ఉన్న బెంచీలను మరమ్మతుల కోసమే తరలించాం. ఇప్పటికే సుమారు రూ.16 వేలు వెచ్చించి బెంచీలకు వెల్డింగ్, ఇతర మరమ్మతులు చేయించాం. మరమ్మతుల కోసం ఎలాంటి నిధులూ ఇవ్వలేదు. చేతి నుంచి నగదు ఖర్చు పెట్టి బెంచీల మరమ్మతులు చేయించాం. బెంచీలు పాత సామాన్ల అంగడికి తరలించామని వచ్చిన ఆరోపణల్లో వాస్తవం లేదు. స్కూల్‌లో మూలన పాత సామాన్లు పెట్టాం.

స్కూల్ మేనేజ్‌మెంట్ నిధులు ఏమయ్యాయి

- ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాసులు

వందలాదిమంది చదువుకునే స్కూల్‌లో మెయింటెనెన్స్ చార్జీల ప్రభుత్వం ఇవ్వకపోవడం ఏమిటి. బెంచీల మరమ్మతులు, ఎలక్ట్రికల్ మెటీరియల్ కోసం చేతి నుంచి అమౌంట్ ఇచ్చామని ప్రధానోపాధ్యాయులు చెప్పడం సమంజసం కాదు. మెయింటెనెన్స్ కింద స్కూల్ మేనేజ్‌మెంట్ నిధులు వినియోగించవచ్చు. బెంచీల తరలింపుపై విచారణ చేయాలి. వచ్చిన మొత్తాన్ని స్కూల్ మేనేజ్‌మెంట్ అకౌంట్‌లో జమ చేయాలి. లేకపోతే ఆందోళన చేస్తాం.

మహారాజశ్రీ కర్నూలు అదనపు సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో

O.S.No. 88/2023

వై. దివాకర్ రెడ్డి. ...వాది

VS

పి.చాంద్ బాషా పోతి వారసులు
1. పి. కాశిమ్‌బీ భర్త లేట్ పి.చాంద్ బాషా
2. పి.ఎండి షఫీక్ తండ్రి లేట్ పి. చాంద్ బాషా
3. పి.జుకియా తండ్రి లేట్ పి. చాంద్ బాషా
అందరూ H.no. 78/8A/12/2-59, మసీదు దగ్గర, కొత్త కృష్ణా నగర్, కర్నూల్ సిటీ. ...ప్రతివాదులు

1 నుండి 3 ప్రతివాదులకు దావా నోటీసు

పై నెంబర్ దావాలో వాది ప్రతివాదుల నుండి దావా మొత్తము రు 12,29,999.00 మరియు 9,11200.00 వెరసి రు 21,41,199.00 ఇందుపైన ముందు వడ్డీ మరియు కోర్టు ఖర్చులు లేటు పి .చాంద్ బాషా యొక్క ఆస్తి 1 నుండి 3 ప్రతివాదుల స్వాధీనంలో ఉండే ఆస్తినైన వసూలు చేసి దావా దాఖలు చేసినారు కావున 1 నుండి 3 ప్రతివాదులు అయినా మీకు ఆక్షేపణలు ఉన్న 30.01.2025 తేదీన పగలు 10:30 గంటలకు హాజరై తెలుపుకొనవలెను లేనియెడల మీ పరోక్షంగా విచారించి తీర్మానించబడును

కోర్టు వారి ఉత్తర్వుల మేరకు


పి. సువర్ణా రెడ్డి,
వాదిపరం అడ్వకేట్,
కర్నూలు.

క్రీడలకు కూటమి ప్రాధాన్యత

- క్రీడలకు సహకరించిన వారందరికీ ధన్యవాదాలు
- ఎమ్మెల్యే బీవీతోనే అభివృద్ధి : టిడిపి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం క్రీడలకు ప్రాధాన్యత ఇస్తోందని టిడిపి నాయకులు తెలిపారు. బుధవారం స్థానిక కుర్నీ కల్యాణ మండపంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బందే నవాజ్, ఈరన్న గౌడ్, రామదాసు గౌడ్, దేశాయ్ నెట్‌వర్క్ గురురాజా రావు దేశాయ్, ఖాసీం వలీ, వాల్మీకి రామకృష్ణ నాయుడు, రైస్ మిల్ నారాయణ రెడ్డి, దామ నరసింహులు, మురళీకృష్ణా రెడ్డి, మహేంద్రబాబు, తిరుపతయ్య నాయుడు, భాస్కర్, ధర్మాపురం గోపాల్ మాట్లాడారు. శ్రీనీలకంఠేశ్వర స్వామి జాతర సందర్భంగా మాజీ మంత్రి బీవీ.మోహన్ రెడ్డి జ్ఞాపకార్థం ఎమ్మెల్యే బీవీ.జయ నాగేశ్వర రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన క్రీడలకు సహకరించిన వారందరికీ ధన్యవాదాలు తెలిపారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే బీవీ క్రీడలను ప్రోత్సహిస్తున్నారని చెప్పారు. తాలూకా, జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలోనే కాకుండా అంతర్జాతీయ స్థాయిలో కూడా క్రీడాకారులు ఎమ్మిగనూరుకు రావడం గర్వకారణమని తెలిపారు. ఎద్దుల బండ లాగుడు పోటీలు, రేలా రేలా, డ్రామాలు, ఫుట్‌బాల్, కబడ్డీ, వాలీబాల్, బ్యాడ్మింటన్ పోటీలను కొనసాగిస్తామని తెలిపారు. ఎద్దుల బండ లాగుడు టోర్నమెంట్, కబడ్డీ, క్రికెట్, ఫుట్‌బాల్, వాలీబాల్, రేలా రేలా, నాటక కళా రంగం నిర్వాహకులు బిజెపి నాయకులు నరసింహులు, టౌన్ బ్యాంకు వైస్ ఛైర్మన్ బండా నరసప్ప, రవి కుమార్, రాజేష్, నరసింహ రావు, మహేష్, డ్రైవర్ ఈరన్న, సాధిక్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న టిడిపి పట్టణ నాయకులు బందే నవాజ్

సిసి రోడ్డు నిర్మాణంలో నాణ్యత లోపం

- నెల రోజుల్లోనే రోడ్డుపై పగుళ్లు
- అధికారుల పర్యవేక్షణ కరువు

ప్రజాశక్తి - ఆస్పరి


పగుళ్లు ఇచ్చిన రోడ్డు

కాంట్రాక్టర్ లాభాపేక్షే ధ్యేయంగా రోడ్డు నిర్మాణం చేపట్టడంతో నెల రోజుల్లోపే రోడ్డుపై పగుళ్లు వచ్చాయి. మండలంలోని చెన్నంపల్లి గ్రామానికి ఇటీవల ఉపాధి హామీ నిధులు రూ.80 లక్షలతో సిసి రోడ్డు నిర్మించారు. రోడ్డు నిర్మాణంలో సిమెంటు, ఇతర ప్రమాణాలను కాంట్రాక్టర్ పాటించక పోవడంతో రోడ్డు నిర్మాణంలో పగుళ్లు వచ్చాయి. దాదాపు కిలోమీటర్ వేసిన సిమెంటు రోడ్డులో చాలా చోట్ల పగుళ్లు స్పష్టంగా కనిపిస్తున్నాయి. రోడ్డు నిర్మాణం నాసిరకంగా ఉండడం వల్ల కొద్ది కాలానికే రోడ్డు దెబ్బతింటుందని గ్రామస్తులు మండిపడుతున్నారు. రోడ్డు నిర్మాణం సమయంలో దగ్గరుండి పర్యవేక్షించాల్సిన అధికారులు లేకపోవడం వల్లే నాసిరకంగా పనులు జరిగాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలి

- సిపిఎం మండల కార్యదర్శి బాలకృష్ణ

చెన్నంపల్లి గ్రామానికి వేసిన సిసి రోడ్డును సిపిఎం మండల కార్యదర్శి బాలకృష్ణ, నాయకులు పెద్ద వీరభద్ర, నరసింహులు బుధవారం పరిశీలించారు. రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యత లేకపోవడంపై మండిపడ్డారు. నాసిరకంగా సిసి రోడ్లు వేసిన కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రోడ్డుపైనే మురుగునీరు

ప్రజాశక్తి - గోనెగండ్ల

గోనెగండ్ల నుంచి గంజహళ్లి గ్రామానికి రోజూ రాకపోకలు సాగించే ప్రధాన రహదారిపై మురుగునీరు నిలిచి గుంతలుగా పడి రోడ్డు అస్తవ్యస్తంగా తయారైందని జనసేన నాయకులు గానుగ బాషా, మాలిక్ తెలిపారు. గోనెగండ్ల నుంచి గంజహళ్లికి వెళ్లే ప్రధాన రహదారిపై నిలిచిన నీటిని, రోడ్డుపై ఉన్న గుంతలను బుధవారం వారు పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడారు. రోడ్డుకు సమీపంలోని కాలనీ వాసులకు డ్రెయినేజీ కాలువ లేక మురుగు నీరు ప్రధాన రహదారిపై నిలిచి పోవడంతో రాకపోకలకు ఇబ్బంది కలుగుతోందని, ద్విచక్ర వాహన దారులు రాత్రి వేళల్లో ప్రమాదాల బారిన పడుతున్నారని తెలిపారు. మార్చి నెలలో మహాత్మ బడేసాహెబ్ తాత ఉరుసు మహోత్సవం కోసం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు లక్షల్లో వస్తారని, వెంటనే అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు. లేకపోతే సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తామన్నారు. జనసేన నాయకులు సుభాన్, ఉత్తేజ్, ఉస్మాన్ పాల్గొన్నారు.


మురుగు నీటిని పరిశీలిస్తున్న జనసేన నాయకులు

అశ్రునయనాల మధ్య నరహరి తీర్థుల ఆరాధన

- మృతుల కుటుంబాలకు సంతాపం

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయం శ్రీరాఘవేంద్ర స్వామి మఠం పీఠాధిపతులు శ్రీసుభుదేంద్ర తీర్థులు అశ్రునయనాల మధ్య శ్రీనరహరి తీర్థుల బృందావనానికి విశేష పూజలు నిర్వహించారు. బుధవారం కర్ణాటక రాష్ట్రంలోని ఆనెగొంది - హంపి మధ్య కొలువైన శ్రీనరహరి తీర్థ బృందావనం వద్ద రాఘవేంద్ర స్వామి ఆరాధ్య దైవమైన మూల రాములకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీనరహరి తీర్థుల బృందావనానికి పంచామృతాభిషేకంతో విశేష పూజలు నిర్వహించి మంగళ హారతులు ఇచ్చారు. అంతకుముందు రోడ్డు ప్రమా దంలో మృతి చెందిన మంత్రాలయం శ్రీగురు సార్వభౌమ సంస్కృత విద్యాపీఠం విద్యార్థులకు సంతాపం తెలిపి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా పీఠాధిపతులు సుభుదేంద్రతీర్థులు మాట్లాడారు. శ్రీరాఘవేంద్రస్వామి గురు పరంపరలో వచ్చిన శ్రీనరహరి తీర్థుల బృందావన పూజ విషయంలో ఇరు మఠాలకు ఉన్న వివాదంపై సుప్రీంకోర్టు తీర్పు తమ మఠానికి అనుకూలంగా వచ్చిందని తెలిపారు. ఉత్తరారాధన ఘనంగా నిర్వహించాలని మంగళవారం శ్రీమఠం సిబ్బందితో పాటు విద్యాపీఠం విద్యార్థులు ప్రత్యేక వాహనాల్లో బయల్దే రారని చెప్పారు. రాత్రి 10 గంటల సమయంలో రోడ్డు ప్రమాదం జరిగిందని, దురదృష్టకరమని తెలిపారు. ఈ ఘటనపై కర్ణాటక ప్రభుత్వం తరఫున పోలీసు శాఖ అధికారుల తీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధ రామయ్య రూ.3 లక్షల చొప్పున నష్టపరిహారం ప్రకటించారని తెలిపారు. దుర్ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి, టిడిపి ఇన్‌ఛార్జీ ఎన్.రాఘవేంద్ర రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారని చెప్పారు. ఆనందోత్సవాలను నిషేధించామని, మృతుల కుటుంబాలను అన్ని విధాలుగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు.


మాట్లాడుతున్న పీఠాధిపతులు

IN THE COURT OF THE HONBLE 2 ADDITIONAL CIVIL JUDGE (JUNIOR DIVISION) KURNOOL.

I.A. No. 360/2024 IN O.S.NO. 863/2024

BETWEEN
1 M. RAMAPULLAIAH
2. M SRINIVASULU
.... PLAINTIFFS

VS-

1. S. NIZAMODDIN
2. M. VENKATESWARLU
.... DEFENDANTS

SUMMONS TO THE RESPONDENT/DEFENDANT NO'S 1 & 2

TO :
1. S. NIZAMODDIN S/O LATE S. EMAMSA MUSLIM, AGED ABOUT 70 YEARS, BUSINESS, R/O H.No. 32/37, BHAGAVAN NAGAR KURNOOL TOWN-AP
2. M. VENKATESHWARLU S/O LATE M RAMAIAH, HINDU, AGED ABOUT 60 YEARS, BUSINESS. R/O H.No. 71/118, BHAGAVAN NAGAR, KURNOOL TOWN A.P

WHERE AS THE ABOVE NAMED PLAINTIFFS FILED THE ABOVE SUIT FOR PARAMANENT INJUNCTION AGAINST YOU NO'S 1&2 HENCE TAKE THE SUMMONS. IF YOU HAVE GOT ANY OBJECTION FOR THE ABOVE SUIT YOU MAY APPEAR BEFORE THIS HON'BLE COURT ON **18-02-2025 AT ABOUT 10:30 A.M.** EITHER IN PERSON OR THROUGH AN ADVOCATE AND FILE YOUR OBJECTIONS IF YOU FAIL TO DO SO, THE SUIT WILL BE DECIDED EX-PARTE

// BY ORDER OF THE COURT //

SRI. C. SHANTHA MURTHY
SRI. P. RAJA RATHNAM
ADVOCATES FOR PLAINTIFFS
KURNOOL.
CELL : 9989041430.

'ఉపాధి' కల్పించి వలసలను నివారించాలి : ఎంపిడిఒ

ప్రజాశక్తి - ఆస్పరి

గ్రామాల్లో ఉపాధి పనులు కల్పించి వలసలను నివారించాలని ఎంపిడిఒ గీతావాణి ఫీల్డ్ అసిస్టెంట్లను ఆదేశించారు. బుధవారం మండలంలోని బిల్లేకల్లు గ్రామంలో ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో వలసలు వెళ్లకుండా ప్రభుత్వం ఉపాధి హామీ చట్టం ద్వారా జాబ్ కార్డు ఉన్న ప్రతి కుటుంబానికీ పనులు కల్పిస్తున్నట్లు తెలిపారు. పిల్లలను వెంట బెట్టుకుని వలస పోవడం వల్ల వారి భవిష్యత్తును నాశనం చేస్తున్నారని చెప్పారు. ఫీల్డ్ అసిస్టెంట్లు గ్రామాల్లో ప్రజలను చైతన్య పరిచి వలసలు వెళ్లకుండా ఉపాధి పనులకు వెళ్లేలా చూడాలన్నారు. ఎపిఒ రామకృష్ణ, వైసిపి జిల్లా కార్యదర్శి పెద్దయ్య పాల్గొన్నారు. **హాలహర్వి** మండలంలోని నిట్రవట్టి గ్రామంలో గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఉషోదయ గ్రామీణ అభివృద్ధి సంస్థ, ఉపాధ్యాయులు అయ్యన్న గౌడ్, ఎంపిపి పాఠశాల ప్రధానోపాధ్యాయులు హేమలత, సిఆర్‌పి ముక్కన్న మాట్లాడారు. గ్రామంలోని ఎంపిపి పాఠశాల బిల్డింగ్‌లో సర్వశిక్ష అభియాన్ సహకారంతో ఉషోదయ గ్రామీణ అభివృద్ధి సంస్థ సీజనల్ హాస్టల్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గ్రామంలోని ఉపాధి హామీ పనులను, సీజనల్ హాస్టళ్లను ఉపయోగించుకోవాలని కోరారు. **గోనెగండ్ల** మండలంలోని వివిధ గ్రామాల్లో వలసలకు వెళ్లే గ్రామస్తులు విద్యార్థులైన పిల్లలను కూడా తీసుకెళ్లి వారి భవిష్యత్తును నాశనం చేయవద్దని గోనెగండ్ల ఎంఇఒ-2 నీలకంఠ తెలిపారు. గోనెగండ్లతో పాటు మండలంలోని పెద్ద మరీవీడు గ్రామంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సిఆర్‌పిలతో కలిసి ప్రజలకు అవగాహన కల్పించారు. వలసల వల్ల విద్యార్థులు చదువుకు దూరమవుతారని, పాఠశాలలో హాజరు శాతం తక్కువగా ఉండడం వల్ల ప్రభుత్వ పథకాలకు వారు దూరమవుతారని తెలిపారు. **హోళగుంద** మండలంలోని వన్నూరు క్యాంపులో గ్రామస్తులకు అవగాహన కల్పించారు. సిఆర్‌పిలు లక్ష్మప్ప, తుకారామ్, రేణుక మాట్లాడారు. విద్యార్థులకు సైతం సీజనల్ హాస్టళ్లు ఏర్పాటు చేస్తోందని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రామంలోని ఉపాధి హామీ పనులను, సీజనల్ హాస్టళ్లను ఉపయోగించుకుని సంతోషంగా ఉండాలన్నారు.


ఆస్పరిలో అవగాహన కల్పిస్తున్న ఎంపిడిఒ గీతా వాణి


హాలహర్విలో


హోళగుందలో


మాట్లాడుతున్న నాయకులు

వలసల నివారణకు చర్యలు చేపట్టాలి

- వ్యకాస జిల్లా ఉపాధ్యక్షులు తిక్కన్న

ప్రజాశక్తి - మంత్రాలయం

వలసల నివారణకు ఉపాధి హామీ పనులు వేగంతం చేయాలని వ్యకాస జిల్లా ఉపాధ్యక్షులు ఈ.తిక్కన్న కోరారు. బుధవారం స్థానిక ప్రయివేట్ అతిథి గృహంలో వ్యకాస మండల కార్యదర్శి టి.ప్రాణేష్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో వ్యవసాయ కార్మికులు అధిక సంఖ్యలో ఊళ్లను వదిలి సుదూర ప్రాంతాలైన బెంగళూరు, హైదరాబాదు, గుంటూరు, ముంబయి లాంటి నగరాలకు వలసలు వెళ్తున్నారని తెలిపారు. వలసలను నియంత్రించాలని, ఉపాధి పనుల కోసం దరఖాస్తు చేసుకునే వారందరికీ జాబు కార్డులు ఇవ్వాలని కోరారు. పని ప్రదేశంలో ప్రమాదవశాత్తు చనిపోయిన వారికి రూ.5 లక్షల నష్ట పరిహారం ఇవ్వాలని, ఫీల్డ్ అసిస్టెంట్లపై రాజకీయ వేధింపులు ఆపాలని తెలిపారు. అవినీతికి పాల్పడిన వారిని తొలగించాలని, శ్రమశక్తి సంఘాల మేటీలకు రూ.5 పారితోషకం ఇవ్వాలని కోరారు. గురువారం ఆదోనిలో జరగనున్న సదస్సును జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు జయరాజు, వ్యకాస మండల అధ్యక్షులు టి.లక్ష్మన్న, జిల్లా కమిటీ సభ్యులు ఈ.శ్రీనివాసులు పాల్గొన్నారు.

అక్రమాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదు : జనసేన

ప్రజాశక్తి - ఆలూరు

నియోజకవర్గంలో ప్రభుత్వ భూములు, చెరువులు, గ్రావెల్స్‌ను అక్రమంగా కబ్జా చేస్తే ఉపేక్షించేది లేదని జనసేన ఇన్‌ఛార్జీ తెర్నేకల్ వెంకప్ప హెచ్చరించారు. బుధవారం ఆయన ఆలూరు చెరువును సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తాము కూటమిలో ఉన్నా అక్రమంగా కబ్జాలకు పాల్పడితే ఎంతటి వారినైనా వదిలేది లేదన్నారు. గతంలో వైసిపి నాయకులు చెరువును ఆక్రమిస్తుండగా అడ్డుకున్నట్లు తెలిపారు. ఇప్పుడు అధికారం ఉంది కదా అని చెరువులో ప్లాట్లు వేసి కబ్జా చేసేందుకు పాల్పడడంపై ఆర్‌డిఒ, కలెక్టర్‌తో మాట్లాడి చెరువును కాపాడేందుకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరినట్లు చెప్పారు. అధికారులు, పాలకుల నిర్లక్ష్యంతో చెరువులో ముళ్లకంపలు, అక్రమంగా వ్యాపారం చేసుకునేందుకు గ్రావెల్ తరలిస్తున్నారని తెలిపారు. ఆలూరు చెరువుకు హంద్రీనీవా, లేదా హెచ్ఎల్‌సి ద్వారా నీటిని నింపి సమ్మర్ స్టోరేజ్‌గా నిర్మించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. అంతకు ముందు ఆర్‌డిఒ భరత్ నాయక్, తహశీల్దార్ గోవింద్ సింగ్ చెరువులో కబ్జాకు పాల్పడిన స్థలాన్ని పరిశీలించారు. విఆర్‌ఒ మహీంద్రా, సర్వేయర్ నాయక్ పాల్గొన్నారు.


చెరువును పరిశీలిస్తున్న వెంకప్ప

'శేషగిరికి మార్కెట్ యార్డు ఛైర్మన్ ఇవ్వాలి'

ప్రజాశక్తి - హోళగుంద

మార్కెట్ యార్డు ఛైర్మన్ పదవిని చిన్నహ్యాట శేషగిరికి ఇవ్వాలని దళిత సంఘాల సీనియర్ నాయకులు బసప్ప, హనుమంతు, వరాల వీరేష్ కోరారు. బుధవారం వారు సమావేశంలో మాట్లాడారు. ఆలూరు నియోజకవర్గ స్థాయిలో దళితులు, అణగారిన వర్గాలకు బాసటగా నిలిచే చిన్నహ్యాట శేషగిరి అని తెలిపారు. ఆలూరు తాలూకా వ్యాప్తంగా నిష్కళంకితుడు, వివాదరహితుడు, అనుభవజ్ఞుడు శేషగిరి ఆలూరు అభివృద్ధికి కృషి చేశారని చెప్పారు. నేటి వరకు టిడిపినే కుటుంబంగా ఆలూరులో పార్టీకి పూర్వ వైభవం కోసమే కృషి చేస్తున్న చిన్నహ్యాట శేషగిరి నిబద్ధత, సేవలు వెలకట్టలేనివని తెలిపారు. మండలానికి తగిన ప్రాధాన్యతనిస్తూ ఎంఆర్‌పిఎస్ తాలూకా మాజీ అధ్యక్షులు, తెలుగు యువత రాష్ట్ర మాజీ కార్యదర్శి శేషగిరికే మార్కెట్ యార్డ్ ఛైర్మన్‌గా పట్టం కట్టాలని కోరారు. సీనియర్ దళిత నాయకులు దేవన్న, రాజు, దళిత యువ నాయకులు రాజేష్, అనిల్, నాగేష్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న నాయకులు

ఎల్ఐసిలో ఉద్యోగాల భర్తీ చేపట్టాలి

- ఎల్ఐసి ఉద్యోగుల సంఘం ఆదోని బ్రాంచి ప్రధాన కార్యదర్శి రవిబాబు

ప్రజాశక్తి - ఆదోని


నిరసనలో మాట్లాడుతున్న రవిబాబు

ఎల్ఐసిలో నూతన నియామకాలు చేపట్టాలని ఎల్ఐసి ఉద్యోగుల సంఘం ఆదోని బ్రాంచి ప్రధాన కార్యదర్శి పిఎస్.రవిబాబు డిమాండ్ చేశారు. బ్రాంచి అధ్యక్షులు ప్రకాష్ ఆధ్వర్యంలో బుధవారం బ్రాంచి కార్యాలయం ముందు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎల్ఐసి యాజమాన్యం ప్రకటించిన మేరకే భర్తీ చేయని 2,700 మంది అసిస్టెంట్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయని, క్లాస్-4 నూతన నియామకాలు చాలాకాలంగా జరగడం లేదని తెలిపారు. ఈ కేడర్లలో రిక్రూట్‌మెంట్ చేపట్టాలన్నారు. గత రెండేళ్లలోనే 5,400 మంది సిబ్బంది సంఖ్య తగ్గిందని, రాబోయే రెండు, మూడేళ్లలో పెద్ద సంఖ్యలో సిబ్బంది విరమణ పొందుతున్నారని చెప్పారు. ఈ నేపథ్యంలో క్లాస్ 3, 4 కేడర్లలో తక్షణమే రిక్రూట్‌మెంట్ చేపట్టాలని డిమాండ్ చేశారు. యూనియన్ నాయకులు ధర్మరాజు, నంజు, లత, రాజశేఖర్, ప్రతాప్ నాయుడు, నాగరాజు, సురేంద్ర ఉన్నారు.

వలసలతో విద్యార్థుల భవిష్యత్తు అంధకారం

- ప్రధానోపాధ్యాయులు శాంతి రాజు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

వలసల వల్ల విద్యార్థుల భవిష్యత్తు అంధకారమవుతుందని ప్రధానోపాధ్యాయులు శాంతి రాజు విద్యార్థుల తల్లిదండ్రులకు తెలిపారు. బుధవారం మాచుమాన్ దొడ్డి గ్రామంలో రెండో రోజూ ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఇంటింటికీ తిరుగుతూ విద్యార్థుల తల్లిదండ్రులను చైతన్య పరిచారు. విద్యార్థులను వలసలకు తీసుకెళ్లవద్దని, అలా చేయడం ద్వారా విద్యార్థుల చదువులకు నష్టం కలుగుతుందని, వారి ఆరోగ్యం కూడా దెబ్బతింటుందని, పిల్లలు బడి మానేయకుండా బడికి పంపాలని ప్రాథమిక పాఠశాల, ఉన్నత పాఠశాలల విద్యార్థుల తల్లిదండ్రులను చైతన్య పరిచారు. తన తల్లి చనిపోవడం, తండ్రి పట్టించుకోకపోవడంతో ఇంటి దగ్గరే ఉంటున్న 7వ తరగతి విద్యార్థి ముతేంద్ర పెదనాన్నను ఒప్పించి పాఠశాలకు పంపాలని కోరారు. అలాగే గ్రామంలో మధ్యలోనే బడి మానేసిన విద్యార్థులను, సక్రమంగా బడికి రాని విద్యార్థుల తల్లిదండ్రులను కూడా చైతన్య పరిచారు. పిల్లల భవిష్యత్తును కాపాడుతూ వారికి ఇంట్లో చదువుకోవడానికి, హోమ్‌వర్క్ చేసుకోవడానికి ప్రశాంతమైన వాతావరణం కల్పించాలని కోరారు. సెల్ ఫోను, టీవీలకు దూరంగా ఉంచాలని తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులు మునిస్వామి, అపర్ణ లత పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ప్రధానోపాధ్యాయులు

DEBTS THE HONOURABLE DEBT RECVOERY TRIBUNAL D.NO.31-31- 21, NARAYANA BHAVAN, SAIBABA STREET, DABAGARDENS, VISAKHAPATNAM
S.A. No 145/24

SUMMONS TO RESPONDENT BANK BY WAY OF PAPER PUBLICATION UNDER SUB SECTION (4) OF SECTION 19 OF THE ACT READ WITH SUB-RULE (2A) OF RULE 5 OF THE DEBTS RECOVERY TRIBUNAL(PROCEDURE) RULE,1993

Between:
Sri. P. B. Srinivas ....Applicant
And
Authorized officer, Union Bank of India, Regional Office, Kurnool. ....Respondent
To
Authorized officer, Union Bank of India, Regional Office, 4th Floor, K.S.Icon Shoppe, Birla Compound, Kurnool - 518002

SUMMONS TO RESPONDENT BANK BY WAY OF PAPER PUBLICATION

Whereas, S.A 145/24 is filed by the applicant before Debt Recovery Tribunal, Visakhapatnam and the same is posted to 29-01-2025 For service of summons. Whereas the Hon'ble Tribunal is pleased to issue summon on the said application under section 19 (4) of the Act, filed against you for Recovery of debt.

In accordance with Sub-Section 4 of Section 19 of the Act, you the Defendants are directed as under

i) To show cause within 30 days of the service of summons as to why relief prayed for should not be granted.
ii) To disclose particulars of assets other than properties and assets specified by Applicant under serial number 3A of the Original Application.
iii) You are restrained from dealing with or disposing of secured assets or such other assets and properties disclosed under serial number 3A of the Original Application, pending hearing and disposal of the application for attachment of properties.
iv) You shall not transfer by way of sale, lease or otherwise, except in ordinary course of his business, any other assets over which security interest is created and/or other assets and properties specified by applicant under serial number 3A of the Original Application without the prior approval of the Tribunal.
v) You are liable to account for the sale proceeds realized by the sale of the secured assets or other assets and properties in the ordinary course of business and deposit such sale proceeds in the account maintained with bank or financial institution holding security interest over such assets.

You are also directed to file the written statement with a copy thereof the applicant before Registrar on **29-01-2025 at 10.30 AM.** failing which the application shall be heard and decided in your absence.

Given under my hand and seal of the Tribunal on this day of the 21st day of January 2025

SIGNATURE OF THE OFFICER AUTHORISED TO ISSUE SUMMONS
Assistant Registrar,
Debts Recovery Tribunal, Visakhapatnam